క్లుప్తంగా

దీపాదాస్‌కు ఘనస్వాగతం

మాడ్గుల: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి.. యువజన కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. నాగార్జునసాగర్ బంజారా ఆత్మీయ సమ్మేళనానికి వెళ్తున్న క్రమంలో ఆమె మండల పరిధి అందుగుల గ్రామం హైవే వద్ద కాసేపు ఆగారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మహ్మద్ బాబా ఆధ్వర్యంలో నాయకులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్షీని కలిసిన వారిలో నాయకులు రమేష్, వరుణ్, శివ, మహేశ్, జంగయ్య, నర్సింహ్మ ఉన్నారు.

లింగబలిజలు అన్ని రంగాల్లో రాణించాలి

కడ్తాల్: వీరశైవ లింగాయత్ లింగబలిజ సమాజం ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ఆర్థిక ప్రగతిని సాధించాలని సమాజం జిల్లా అధ్యక్షుడు మిర్యాణం అనిల్‌కుమార్, నాయకులు చాట్ల సర్వేశ్వర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శివాలయంలో సమాజం మండల అధ్యక్షుడు సర్వేశ్వర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వీరశైవలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కోటి దీపోత్సవ ప్రధాన అర్చకుడు రేవల్లి రాజుశర్మ, గౌరవ సలహాదారు మల్లికార్జున్ అయ్యగార్, కోశాధికారి బుచ్చప్ప, ఈశ్వరప్ప, నాగభూషణం, నీలకంఠం, రాజు, మహేశ్, నాగప్ప, మల్లప్ప, సంతోష్‌కుమార్, రఘు, గౌరిశంకర్, సుధాకర్ ఉన్నారు.

ఆర్యవైశ్య మహాసభ నేతలకు సత్కారం

ఆమనగల్లు: ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులుగా వీరబొమ్మ రామ్మోహన్, చంద్రశేఖర్‌లు ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఇరువురిని సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

సంక్రాంతి క్రికెట్ ప్రీమియర్ లీగ్ షురూ

ఇబ్రహీంపట్నం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాయపోల్, ఖానాపూర్ గ్రామాల్లో క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను ఆదివారం సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంఖాల దాసు.. రాయపోల్‌లో, మార్కెట్ డైరెక్టర్ దొంతరమోని రాజు.. ఖానాపూర్‌లో టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని, చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహా, సీహెచ్ నర్సింహా, మణికంఠ, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్ మహేశ్, టోర్నీ ఆర్గనైజర్ ఎండీ పాష పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మంచాల: మండల పరిధి చిత్తాపూర్ గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. మరో 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సాధురం ఇబ్రహీంపట్నం వైద్యశాల వైద్యులు ఎమ్మెస్ రెడ్డి, భగవాన్, మాజీ సర్పంచ్ నాగరాజ్ గౌడ్, నాయకులు బాలరాజ్, పెద్ది రాజు పాల్గొన్నారు.

బోడకొండలో పీఏసీఎస్ ఏర్పాటు చేయాలి

మంచాల: మండలం పరిధి బోడకొండ గ్రామంలో కొత్తగా పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు గుండెమోని జయమ్మ కోరారు. ఆదివారం నగరంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఒక కేంద్రం ఉందని, కొత్తగా మరో కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. అటు లోయపల్లి, సత్తితండా, అంబోత్‌తండా, కొర్రవాణితండా ఇటు దాద్‌పల్లి, చీదేడ్, రంగాపూర్, ఎల్లమ్మ తండాలకు మధ్యలో ఉన్న బోడకొండలో సెంటర్ ఏర్పాటు చేస్తే.. ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జంగయ్య గౌడ్, శ్రీనివాస్ నాయక్, దాసుగౌడ్, వెంకటేశ్, రాందాస్ నాయక్ ఉన్నారు.

సామాజిక విలువలను పెంపొందించుకోవాలి

హుడాకాంప్లెక్స్: విద్యార్థి దశలోనే సామాజిక విలువలు పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో ఆదివారం నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్‌లో మాటాడుతూ.. పరీక్షల్లో వెనుకబడినా.. విజయం కోసం యత్నించాలని సూచించారు.

ట్రాఫిక్ చక్రబంధం!



ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో పోలీసులు విఫలం అవుతున్నారు. ఫలితంగా పట్నం రోడ్లపై వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు. వాహన వలయంలో చిక్కుకొని విలవిల్లాడుతున్నారు. చక్రబంధాన్ని ఛేదించి గమ్యం చేరుకోవడానికి జనం అష్టకష్టాలు పడుతున్నారు.

నడిరోడ్డుపై నరకయాతన
- ట్రాఫిక్ ఠాణా ఉన్నా.. తప్పని తిప్పలు
- సిబ్బంది కొరతతో రద్దీ కష్టాలు
- క్రమబద్ధీకరించడంలో విఫలం
- చలాన్లతో సరి.. నియంత్రణ గాలికి

ఇబ్రహీంపట్నం: పేరుకే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్. ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసి ఏడాదిన్నర గడిచినా రద్దీ కష్టాలు తీరడం లేదు. అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శనిచందంగా.. ఠాణా ఉండి సిబ్బంది లేకపోవడంతో పరిస్థితిలో మార్పు కానరావడం లేదు. ఇందుకు కారణం ఏరియాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ, సిబ్బందిని నియమించకపోవటమేనని తెలుస్తోంది. ఈ స్టేషన్ పరిధిలో పట్నం, ఆదిబట్ల, మంచాల, యాచారం, మాడ్గుల, గ్రీన్ ఫార్మాసిటీ ఠాణాలు వస్తాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం ఠాణాలో మొత్తం 55 మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉండగా.. కేవలం 19 మంది(ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లు, ఐదుగురు హోం గార్డ్స్, ఒక పెట్రోలింగ్ డ్రైవర్) పని చేస్తున్నారు.

కట్టడి మరచి.. ఫైన్లు విధించి

తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, మంగల్‌పల్లి ప్రాంతాల్లో ప్రతిరోజు ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. దీనిని క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు లేకపోవడం వాహనదారులకు శాపంగా మారింది. ట్రాఫిక్ కష్టాలను గట్టెక్కి... ఎలాగైనా గమ్యం చేరుకోవాలనే తొందర్లో రెడ్ సిగ్నల్ జంప్ చేయడమో, రాంగ్ రూట్లో వెళ్లడం, హెల్మెట్ ధరించకపోవటం తదితర పొరపాట్లు చేస్తున్నారు. దీనినే ఆసరా చేసుకుంటున్న పోలీసులు.. ట్రాఫిక్ కట్టడి మరచి, చలాన్లు విధిస్తూ చేతులు దులుపుకొంటున్నారని వాహనచోదకులకు ఆరోపిస్తున్నారు.

రద్దీ పెరిగినా.. పాతరోడ్లే

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో వాహనాల సంఖ్య పెరుగుతోంది. రోజుకు వందల కొద్ది కొత్తవాహనాలు రోడ్లపై పరుగులు తీస్తున్నాయి. కానీ అందుకు అనుగుణంగా రహదారుల విస్తరణ చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. దీనికి తోడు ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో ప్రమాదం అని తెలిసినా వాహనదారులు నిబంధనలు మరచి ఇష్టానుసారంగా దూసుకుపోతున్నారు. ప్రమాదాలకు కారణం అవుతున్నారు.

రోడ్లపైనే పార్కింగ్

నిత్యం వేల సంఖ్యలో చిన్నపెద్ద వాహనాలు నాగార్జునసాగర్, హైదరాబాద్ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో రోడ్డుపైనే కాకుండా, ఇరువైపులా ఉన్న దుకాణ సముదాయాల ఎదుట సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఆటోలు, జీపులు నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. పట్నంలోని మంచాల, నాగార్జునసాగర్ ప్రధాన రోడ్డులో నిత్యం ఇదే జరుగుతోంది. చిరువ్యాపారుల తోపుడు బండ్లు రోడ్డు పక్కనే ఉండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. పెద్ద, ద్విచక్రవాహనాల సంగతి ఎలా ఉన్నా.. కనీసం కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొందని ప్రాంత ప్రజలు వాపోతున్నారు.



ప్రధాన రోడ్డుపై నిలిపిన వాహనాలు

పార్కింగ్ స్థలం ఉంటేనే పర్మిషన్



రహదారులకు ఇరువైపులా వాణిజ్య భవనాలు నిర్మించుకునే వారికి.. పార్కింగ్ స్థలం ఉంటేనే నిర్మాణ అనుమతి ఇవ్వాలి. సరైన స్థలం లేకపోవడంతో కొనుగోలుదారులు.. తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇతర వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతోంది.

– జగదీశ్వర్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం

అవగాహన కల్పించాలి



వాహనాల పెరుగుదలతో రహదారులు రద్దీగా ఉంటున్నాయి. దీనికి అనుగుణంగా రోడ్లు, పార్కింగ్ స్థలాలు లేక నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. దీనిని నివారించేందుకు పోలీసులు.. ట్రాఫిక్ నిబంధనల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. రోజూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి.

– గరిగే నర్సింహగౌడ్, ఇబ్రహీంపట్నం

చర్యలు తీసుకుంటున్నాం



ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. అయినప్పటికీ అతిక్రమించిన వారిపై చలాన్లు విధిస్తున్నాం. పరిస్థితులకు అనుగుణంగా ప్రజల్లో మార్పురావాలి. పోలీసులకు సహకరించాలి.

– గురునాయుడు, ట్రాఫిక్ సీఐ

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె



ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

- కార్మికులను పర్మినెంట్ చేయాలి
- సీపీఎం, సీఐటీయూ నాయకుల డిమాండ్
- ముగిసిన 48 గంటల దీక్ష

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు సిద్ధమని సీపీఎం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ శివశంకర్, సీఐటీయూ కన్వీనర్ పెంటయ్యలు అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన 48 గంటల దీక్ష ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. కార్మికులందరికీ వారం తప్పు సెలవులు ఇవ్వాలని, రిటైర్మెంట్ సదుపాయం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 6న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడికి కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు హంసమ్మ, రవి, గోపి, విజయ్, అంజయ్య, సుధాకర్, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నంలో..

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కిషన్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, నాలుగేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లిస్తున్న రూ.10 వేల వేతనం.. 16,500లకు పెంచాలని కోరారు. అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు, ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లేష్, లక్ష్మయ్య, యాదయ్య, రాజు, సురేష్, రవీందర్, యాదయ్య, యాదగిరి, వెంకటేశ్, రఘునాథ్, కుమార్, సంతోష, రమాదేవి, లక్ష్మమ్మలు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి పూజ

మంచాల: మండల పరిధి ఆరుట్ల గ్రామంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి ఆదివారం అయప్ప స్వామి ఇరుముడి పూజ ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను అయ్యప్ప మాల ధారులు సన్మానించారు.

‘ఫ్లైఓవర్’కు నిధుల మంజూరు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్ జంక్షన్‌గా టీకేఆర్ కమాన్ నుంచి మందమల్లమ్మ ఎక్స్‌రోడ్డు వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.416 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని 19వ డివిజన్ కార్పొరేటర్ బైగళ్ల బాలమణి అన్నారు. ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబును ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఫ్లైఓవర్‌తో ట్రాఫిక్ సమస్య తీరుతుందని తెలిపారు.

కల్వకుర్తికి గర్వకారణం

ఆమనగల్లు: పాలమూరు- రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల పథకానికి దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం హర్షణీయమని, ఇది కల్వకుర్తికి గర్వకారణమని ఆమనగల్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. పార్లమెంటేరియన్‌గా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన జైపాల్‌రెడ్డి పేరును సార్థకం చేసేలా, భవిష్యత్తు తరాలు గుర్తించే విధంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ఉన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: నాలుగు జిల్లాలను సస్యశ్యామలం చేయడంతో పాటు, ప్రజల తాగునీటి అవసరాలను తీర్చే పాలమూరు- రంగారెడ్డిఇరిగేషన్ ప్రాజెక్టుకు కల్వకుర్తి ముద్దుబిడ్డ, ఉత్తమ పార్లమెంటేరియన్, దివంగత కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం కల్వకుర్తి నియోజకవర్గానికి గర్వకారణమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో బీపీఎల్ పేరుతో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆదివారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండాల సురేశ్, బీఆర్‌ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడు నరేశ్ ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు యూత్ నాయకుడు నరేశ్ టీషర్టులు, ట్రోఫీతో పాటు రూ.12 వేలు, రూ.8వేల నగదును అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, నాయకులు సీహెచ్ కృష్ణ, దువ్వాసి నర్సింహ, ఎగిరిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

సుందరీకరణ కలేనా?

- ఆదరణ కోల్పోయిన జల్‌పల్లి చెరువు
- మసకబారుతున్న అందాలు
- కంచె లేక ప్రమాదాలు నిత్యకృత్యం



జల్‌పల్లి పెద్ద చెరువు

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువు సుందరీకరణ పనులు అటకెక్కాయి. ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రకృతి రమణీయతను సంతరించుకున్న పరిసరాలను ఎప్పుడెప్పుడు అభివృద్ధి చేస్తారా అని ప్రజలకు ఎదురు చూస్తున్నారు. కొండలు, చెట్లు, పచ్చిక బయళ్ల నడుమ 150 ఎకరాల విస్తీర్ణంలో నిండు కుండలా ఉన్న చెరువు అందాలు చూడాలంటే రెండు కళ్లు చాలవు. అలాంటి చెరువును ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చెరువు అందాలు మసకబారుతున్నాయని, అసలు అభివృద్ధికి నోచుకుంటుందా అని అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

ఇనుప కంచెతో సరి

ఎనిమిదేళ్ల క్రితం నాటి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చెరువును అభివృద్ధి చేస్తే.. చక్కటి పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉందని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. రూ.9 కోట్ల వ్యయంతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, మైసమ్మ ఆలయ సమీపంలో చెరువు మధ్యలో ఉన్న చిన్న గుట్ట వరకు స్టీల్ బ్రిడ్జిని నిర్మించి ఐలాండ్ ఏర్పాటు, రెండు వ్యూ పాయింట్లు, ప్రమాదాలు జరగకుండా పూర్తి స్థాయిలో ఇనుప కంచెతో పాటు చెరువు గట్టున ఉన్న గుట్టను రాక్ గార్డెన్, ప్రకృతి ప్రియుల కోసం బోట్ షికార్ సైతం ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. కానీ ప్రస్తుతానికి కట్ట వైపు ఇనుప కంచె, కట్టపై విద్యుత్ సదుపాయం కల్పించి మమ అనిపించారు.



చెరువు సుందరీకరణ పనుల కోసం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి(ఫైల్)

నిధులున్నా నిర్లక్ష్యం

మిషన్ కాకతీయ పథకంలో భాగంగా 2016లో నాటి ప్రభుత్వం రూ.45 లక్షల వ్యయంతో చెరువు కట్ట పునరుద్ధరణ, అలుగును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసింది. ఆ ఏడాది నుంచి భారీ వర్షాలు కురవడంతో చెరువు పూర్తిగా నిండి అలుగు పోసింది. చెరువులోకి నీరు సమృద్ధిగా చేరడంతో చేపల పెంపకందారులకు జీవనోపాధి లభించింది. 2024 సెప్టెంబర్ 27న ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హెచ్ఎండీఏ అధికారులతో కలిసి చెరువును సందర్శించారు. సుందరీకరణ చేయాల్సిన పనుల గురించి చర్చించారు. ఇందుకు సంబంధించిన నిధులు సైతం ఉన్నప్పటికీ హెచ్ఎండీఏ అధికారులు నిర్లక్ష్యపు ధోరణిని వీడటం లేదు.

తరచూ ప్రమాదాలు

చెరువుకు కంచె పూర్తి స్థాయిలో వేయని కారణంగా యువకులు సరదాగా ఈత కొట్టేందుకు దిగి, నీట మునిగి మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. కట్టపై పూర్తిగా కంచె వేసినప్పటికీ, మైసమ్మ ఆలయం వద్ద వినాయక ప్రతిమల నిమజ్జనం కోసం అధికారులు రెండు చోట్ల కంచెను తొలగించారు. ఈ కారణంగా ఓపెన్‌గా ఉండడంతో ఎంతో మంది ప్రమాదవశాత్తు అందులో పడి దుర్మరణం చెందుతున్నారు. జల్‌పల్లి కమాన్ రోడ్డు, వాదే ముస్తఫా వైపు కూడా పూర్తి స్థాయిలో కంచె వేసినట్లయితేనే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది.

మురికి కూపంగా..



నియోజకవర్గంలోని చెరువులను సుందరీకంచి, జల్‌పల్లి చెరువును పట్టించుకోవడం లేదు. ఈ చెరువు నిత్యం వాకర్లతో కళకళలాడుతుంటుంది. అలాంటి చెరువు.. అధికారుల ఉదాసీనత కారణంగా మురికి కూపంగా మారుతోంది. హెచ్ఎండీఏ అధికారులు స్పందించి, పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలి. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలి. – శివకుమార్, జల్‌పల్లి

ఆమనగల్లు అభివృద్ధికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం ఆమగనల్లు పట్టణం విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాష, కార్యదర్శి జంగయ్య, సభ్యులు చుక్క అల్లాజీగౌడ్, నర్సింహ, రమేశ్ తదితరులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం కాలనీలో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్, కృష్ణ తాగునీటి పైపులైన్, మురుగు కాలువలు, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు, ఎంపీడీఓ కార్యాలయం, జెడ్పీహెచ్‌ఎస్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడంతో పాటు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, ఆమనగల్లును అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్‌యాదవ్, డాక్టర్ శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, బొజ్జ సాయిరెడ్డి, కేశవులు, శ్రీను, వెంకట్‌రెడ్డి, నరేందర్, యాదగిరి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఎమ్మెల్యేను కలిసిన చల్లా

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చల్లా సురేందర్‌రెడ్డి ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన స్వగ్రామం చల్లంపల్లి, అనుబంధ గ్రామం వంపుగూడ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారంతో పాటు.. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నరేందర్ పేర్కొన్నారు.

రైతు సంక్షేమ ప్రభుత్వం

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత

కడ్తాల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత అన్నారు. ఆదివారం మండల పరిధి టాక్‌రాజుగూడతండాకు చెందిన గిరిజన రైతులు, నాయకులు చైర్‌పర్సన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం.. సబ్సిడీపై సాగు పరికరాలను అందిస్తోందని తెలిపారు. ధాన్యం క్వింటాలుకు రూ.500లు బోనస్ ఇస్తుందని, సంక్రాంతి నుంచి రైతుభరోసా ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనుందని పేర్కొన్నారు. కర్షకులంతా కాంగ్రెస్ సర్కార్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు బలరాం నాయక్, భీమానాయక్, జగన్‌నాయక్, బీమ్లా, లాలునాయక్, కిషన్ నాయక్ ఉన్నారు.



చైర్‌పర్సన్‌ను సన్మానించిన నాయకులు, రైతులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధి శోభానగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తుర్కయంజాల్ గ్రామం, లక్ష్మీ మెగా టౌన్‌షిప్, పాటిగూడ, సూరజ్ నగర్, లక్ష్మీ గార్డెన్, కుర్మగూడ, వైఎస్‌ఆర్‌కాలనీ, హెవెన్స్ కార్నర్, ఎస్‌ఎస్‌ఆర్ కాలనీ, శ్రీసాయి హ్యాపీ హోమ్స్, సాయి టౌన్‌షిప్, అవివా హోమ్స్, ఎం.ఎం.కుంట, సినర్జీ హోమ్స్, ద్వారకానగర్, శోభానగర్, సిలికాన్ సిటీ, అపిల్ సిటీ, ఏవీనగర్, వింటేజ్ హోమ్స్, యాదాద్రి హోమ్స్, సాగర్ రెసిడెన్సి, సాగర్ ఎన్‌క్లేవ్, రాఘవేంద్ర నగర్, శ్రీరామ్‌నగర్, జనచైతన్య కాలనీ, సూర్యసాయినగర్, గంగిరెడ్డి కాలనీ, శ్రీశ్రీ ఎన్‌క్లేవ్‌లో సరఫరాకు ఆటంకం కలగనుందని వెల్లడించారు.

ఇంజాపూర్ పరిధిలో..

11 కేవీ సీఆర్‌పీఎఫ్, 11 కేవీ ఇందిరమ్మ, 11 కేవీ అపిల్ అవెన్యూ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు ఇంజాపూర్ గ్రామం, సీఆర్‌పీఎఫ్ కాలనీ, మిధాని కాలనీ, ఇందిరమ్మ కాలనీ, నీలాద్రి నగర్, అపిల్ అవెన్యూ కాలనీ, కమ్మగూడ, లక్ష్మీనగర్, సుందరయ్య నగర్, వశిష్ఠ కాలనీ, అన్నపూర్ణ, తుల్జా భవానీ కాలనీ, శ్రీరంగా పురం, బాలాజీ నగర్, స్నేహ పురి, మైత్రీ మెడోస్, సాయినాథ్ కాలనీ, సాయిప్రియ నగర్, అంజనాపురి కాలనీలో సరఫరా నిలిపి వేయనున్నామని ఏఈ రాములు తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వైభవంగా షోడశలక్ష్మి హోమం

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో ఆదివారం షోడశలక్ష్మి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎనిమిది రోజుల పాటు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, జపాలు చేశారు. అనంతరం అమ్మవారికి అభిషేకం పూజలు చేసి హోమాన్ని నిర్వహించారు. పూర్ణాహుతి చేశారు. సాధకులకు గురూజీ దంపతులు తీర్థప్రసాదాలు,ఆశీర్వాదాలతో పాటు అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు